క్లుప్తంగా...

నేడు చీర్యాలకు మంత్రిరాక

కీసర: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం చీర్యాల ఎంఎల్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న సాగునీటి దినోత్సవంలో పాల్గొనేందుకు మంత్రి మల్లారెడ్డి విచ్చేయనున్నట్లు ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ, ఎంపీడీఓ వాత్సల్యదేవి తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు తదితరులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నేడు సాగునీటి దినోత్సవ సంబురాలు

– కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాగునీటి దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కీసర మండలం చీర్యాలలో జరిగే సాగునీటి సంబురాల్లో జిల్లా మంత్రి మల్లారెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. అలాగే దుండిగల్ గండిమైసమ్మ, చిన్నదామెర చెరువు వద్ద నీటి పారుదల శాఖ, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సాగునీటి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సంబురాల్లో తెలంగాణ రాష్ట్రం రాకముందు రైతులు నీటి కోసం ఎదుర్కొన్న కష్టాలు, ఇబ్బందులు రైతులకు తెలుపడంతోపాటు ప్రస్తుతం సాగునీటి రంగంలో సాధించిన ప్రగతిని అర్థమయ్యేలా విశ్లేషించాలని ఆయన పేర్కొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్చాలని వినతి



మేడ్చల్: మేడ్చల్‌లో జాతీయ రహదారిపై ఉన్న మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోకి మార్చాలని బీఆర్ఎస్ పట్టణ నాయకులు, డాక్యుమెంట్ రైటర్లు మంత్రి మల్లారెడ్డికి విన్నవించారు. ఈ మేరకు వారు మంత్రి నివాసంలో ఆయనను కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మూడో అంతస్తులో ఉండటం, పార్కింగ్ లేకపోవడంతో అందరూ అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటంతో ఆవరణ కుంటలా తయారవుతోందని వివరించారు. సువిశాల ప్రాంగణం ఉన్న మండల పరిషత్‌కు కార్యాలయాన్ని మార్చి అక్కడ నూతన భవనం నిర్మించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి విష్ణుచారి, మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్, డాక్యుమెంట్ రైటర్లు అనంత్‌రావు, జనార్దన్‌రెడ్డి, జంగయ్య, లక్ష్మణ్, నవీన్ నర్సింగ్, రవీందర్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో చేరేందుకు 10లోపు దరఖాస్తు చేసుకోవాలి

మేడ్చల్: మేడ్చల్‌లోని ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. ఒక సంవత్సరం కోర్సులైన డీజిల్ మెకానిక్, వెల్డర్, రెండు సంవత్సరాల కోర్సులైన టర్నర్, ఫిట్టర్, ఎలక్ట్రిషన్, ఎలక్ట్రానిక్స్ వంటి ట్రేడ్స్‌లలో చేరేందుకు ఈ నెల 10వ తేదీలోపు పదో తరగతి ఉత్తీర్ణత చెంది, 14 సంవత్సరాలు నిండిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు www.iti.teanfana.gov.in సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

పోచారం: ఇద్దరు గంజాయి విక్రేతలను ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది మంగళవారం అరెస్ట్ చేశారు. సీఐ మల్లయ్య వివరాల ప్రకారం.. కీసర మండలంలోని అంకిరెడ్డిపల్లి జంక్షన్ వద్ద అనుమానితులను తనిఖీ చేయగా ఇద్దరి దగ్గర గంజాయి దొరికింది. వీరిని అదుపులోకి తీసుకొని విచారించగా నిందితులు ఒడిశాకు చెందిన సంగ్రామ్ ప్రధాన్(25), ఉత్కల్ బెహరా అని తెలిసింది. ఒడిశా నుంచి తక్కువ ధరకు గంజాయిని తెచ్చి నగరంలోని కాలేజీ విద్యార్థులకు, గంజాయి బానిసలకు ఎక్కువ రేటుకు అమ్ముతున్నట్లు చెప్పారు. వారినుంచి 5 కేజీల గంజాయితో పాటు సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐలు పురుషోత్తం రెడ్డి, శ్రావణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్‌లో పారిశ్రామిక ప్రగతి దినోత్సవం

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఇన్ఫోసిస్ కంపెనీలో మంగళవారం పారిశ్రామిక ప్రగతి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్ఫోసిస్ క్యాంపస్‌లోని ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో చైర్మన్ కొండల్‌రెడ్డి, కమిషనర్ సురేష్, పలువురు కౌన్సిలర్లు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం యమ్నంపేట్‌లో రూ.5 లక్షలు సీఎం ప్రత్యేక నిధులతో డ్రైనేజీ పనులకు చైర్మన్ శంకుస్థాపన చేశారు.

చేప పిల్లల పంపిణీకి లక్ష్యం ఖరారు

- 345 చెరువుల్లో 91 లక్షల చేప పిల్లల పంపిణీకి ప్రతిపాదనలు
- చేప పిల్లల కోసం కొనసాగుతున్న టెండర్ల ప్రక్రియ
- చెరువుల్లోకి నీరు రాగానే వదిలేందుకు మత్స్యశాఖ ఏర్పాట్లు



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం ఈ ఏడాది ఉచితంగా పంపిణీ చేసే చేప పిల్లల లక్ష్యాన్ని జిల్లాల వారీగా ఖరారు చేసింది. ఈ మేరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మత్స్యశాఖ అధికారులు 91లక్షలు చేప పిల్లలను 345 చెరువులు/కుంటల్లో వదిలేందుకు లక్ష్యాన్ని నిర్దేశిస్తూ.. ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన చెరువులు/కుంటల్లో నిర్ణీత గడువులోగా వదిలేందుకు మత్స్యశాఖ కసరత్తు చేస్తోంది. చేప పిల్లల సరఫరాకు అవసరమైన టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. గత నెల 31న వాటిని తెరవాల్సి ఉండగా, అనివార్య కారణాలతో ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది 345 చెరువుల్లో విడతల వారీగా 91 లక్షల చేప పిల్లల పంపిణీ లక్ష్యంగా నిర్ణయించగా, ఇందులో పెద్ద సైజు చేప పిల్లలు(80–100 ఎంఎం) 13.50 లక్షలు చిన్నసైజు చేప పిల్లలు (40–45 ఎంఎం) 77.50 లక్షలు ఉంటాయి.

59 మత్స్య సహకార సంఘాలు.. 2,765 మంది సభ్యులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 59 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా, ఇందులో 2,765 మంది సభ్యులున్నారు. ఇందులో 8 సంఘాలు కొత్తగా ఏర్పడ్డాయి. ఏడాది మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఆధ్వర్యంలో 91 లక్షల చేప పిల్లలను గ్రామపంచాయతీ, మున్సిపాలిటీల పరిధిలో గుర్తించిన 345 చెరువులు, కుంటల్లో పెంచాలని నిర్ణయించారు. జూలై నెలాఖరులోగా చేపపిల్లలను వదిలితే, బాగా పెరిగే అవకాశం ఉంది. ఆలస్యంగా వదలడం వల్ల అవి పెరిగే సమయానికి చెరువుల్లో నీళ్ల తగ్గిపోయి పెరుగుదల సరిగా ఉండదని మత్స్యకారులు పేర్కొంటున్నారు. అలాగే.. జిల్లాలో స్థానికంగా విక్రయించే చేపలు, ఎక్కువ డిమాండ్ ఉండే రకాలను సరఫరా చేయాలని వారు కోరుతున్నారు. చేప పిల్లల సైజు సరిగా లేకపోవడం, సకాలంలో సరఫరా చేయకపోవడంతో అవి పెరగడం లేదని పేర్కొంటున్నారు. చేప పిల్లలను ఆలస్యంగా చెరువుల్లో వేస్తే.. పెరగడానికి 15–18 నెలల వుతుందంటున్నారు. నిబంధనల మేరకు కాంట్రాక్టర్లు 35–40 ఎంఎం సైజుతో కొన్ని, 82–100 ఎంఎం సైజులో మరి కొన్ని చేప పిల్లలను సరఫరా చేయాల్సి ఉంటోంది. అయితే.. కాంట్రాక్టర్లు వాటి కంటే తక్కువ సైజులో ఉన్న చేప పిల్లలను, ఎదుగుదల లేని రకాలను సరఫరా చేస్తున్నారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. గతంలో లబ్ధిదారులకు ఇచ్చే పొట్లాల(ప్యాకెట్)లో వేయి చేప పిల్లలు ఉండాల్సి ఉండగా, తక్కువగా ఉంటున్నాయని, ఈ ఏడాది పక్కాగా ఉండాలని వారు కోరుతున్నారు.

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని..

గతేడాది పంపిణీలో ఆలస్యం జరిగింది. నాటి అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది సకాలంలో చేప పిల్లల పంపిణీ సజావుగా చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నాం. చేప పిల్లల సైజులోనూ, ప్యాకెట్లలోనూ ఎలాంటి తేడాలు లేకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్లు చేప పిల్లలను సరఫరా చేస్తారు.

– బి.పూర్ణిమా, మత్స్యశాఖ జిల్లా అధికారి, మేడ్చల్–మల్కాజిగిరి.

13 మహిళా మత్స్య సహకార సంఘాలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 13 మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా, ఇందులో 700 మంది సభ్యులు ఉన్నారు. ఈ సంఘాల సభ్యులు చేపలు అమ్ముకోవడం, రంగు చేపల ఉత్పత్తి వంటి కార్యక్రమాల్లో భాగస్వామ్యాన్ని పంచుకుంటున్నారు.

గతేడాది నష్టపోయిన మత్స్యకారులు

గతేడాది చెరువులు, కుంటల్లోకి నీళ్లు చేరగానే చేప పిల్లలను పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ, మత్స్యశాఖ సకాలంలో టెండర్లు పూర్తి చేయలేకపోవడం వల్ల సెప్టెంబర్ మూడో వారం నుంచి పంపిణీ చేశారు. దీంతో చేప పిల్లలు ఎదగాల్సినంత పెరగకపోవటంతో పాటు పలు చెరువుల్లో చేప పిల్లలు మృత్యువాత పడ్డాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని చెరువులు, కుంటల్లోకి వెంటనే చేప పిల్లలను వదలాలని మత్స్య సహకార సంఘాలు కోరుతున్నాయి.

డబ్బులుంటే ఉద్యోగం కొనుక్కోవచ్చు

- నిరుద్యోగుల కళ్లలో మట్టి కొడుతున్న కేసీఆర్ ప్రభుత్వం
- మూడు తరాల ఉద్యమకారులను స్మరించుకోవాలి
- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



సన్మాన గ్రహీతలతో ఎమ్మెల్యే ఈటల రాజేందర్, జర్నలిస్టు యాదగిరి, ఇన్నారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: మూడు తరాల ఉద్యమకారులను స్మరించుకోవాలని, పాటలతో బెల్లి లలిత, ప్రాణత్యాగం చేసి సిరిపురం యాదయ్య, శ్రీకాంతాచారి ఉద్యమానికి ఊపిరి పోశారని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, ఉద్యమకారుడు ఇన్నారెడ్డి అన్నారు. తెలంగాణ అమర వీరులను స్మరించుకొని వారి కుటుంబ సభ్యులు, తెలంగాణ ఉద్యమకారులను అవుషాపూర్ స్టార్ ఫంక్షన్ హాల్లో జేఏసీ, వైఎస్సార్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యమకారులను మంగళవారం సన్మానించి రక్తదాన శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగర హారం, పెన్‌డౌన్, సకల జనుల సమ్మె, ఆర్టీసీ సమ్మె, మిలియన్ మార్చ్, త్యాగాలు, ఉద్యమ పునాదులపై ఏర్పడిన తెలంగాణలో హక్కులు, స్వేచ్ఛను హరించి సీఎం కేసీఆర్ ఉద్యమాలు చేయకుండ ధర్నా చౌక్‌ను ఎత్తివేశారన్నారు.

సొంతింటి కల కలగానే..

తెలంగాణలోని నిరుద్యోగుల ఉద్యోగాల కోసం ఎదురు చూస్తుంటే పేపర్ లీకేజీలతో వారి కళ్లలో మట్టి కొట్టారని, ఉద్యోగాలు చదువుకున్న వారికి కాకుండా డబ్బుతో కొనుగోలు చేసిన వారికే అనే నీచ సంస్కృతికి తెరలేపారన్నారు. పేదలకు రెండు పడకల ఇళ్లు ఇవ్వకుండా సొంతింటి కల కలగానే మిగిలిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు కులమతాలకతీతంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సన్మానం పొందిన ఉద్యమకారులు ప్రజాగాయకురాలు సంధ్య, అరుణ, మాజీ జెడ్పీటీసీ ఉదారి శివకుమర్‌ముదిరాజ్, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, మహేంద్రచారి, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, లక్ష్మారెడ్డి, పోచిరెడి, నర్సింహారెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, శ్రీశైలం, రాజశేఖర్, నాయకులు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, బీజేపీ నియోజక వర్గం ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షులు ప్రవీణ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ కావేరి మశ్చేందర్‌రెడ్డి, బాలుయాదవ్ పాల్గొన్నారు.

హామీల అమలు ఎప్పుడు..?

మేడ్చల్: రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులను ప్రభుత్వం పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు యూసుఫ్, బాలరాజు డిమాండ్ చేశారు. మేడ్చల్‌లో నిర్వహించిన మున్సిపల్ కార్మిక సంఘ మహాసభలో వారు పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ మున్సిపాలిటీల్లో కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా మారుస్తామని చెప్పినా అది అమలు కాలేదన్నారు. సిబ్బందిని రెగ్యులరైజ్ చేసి నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కలిపించాలని డిమాండ్ చేశారు. మహాసభల సందర్భంగా మేడ్చల్‌లో జాతీయ రహదారిపై కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.



మేడ్చల్‌లో కార్మికుల ర్యాలీ

ఔషధ మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలి


– డీఎంహెచ్ఓ డా.పుట్ల శ్రీనివాస్



అన్నోజిగూడలోని హెల్త్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డా.పుట్ల శ్రీనివాస్

పోచారం: అన్నోజిగూడలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను డీఎంహెచ్ఓ డా.పుట్ల శ్రీనివాస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్త్ సెంటర్‌లో ఔషధ మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆరోగ్యకరమైన జీవితానికి కల్తీ లేని ఆహారాన్ని తీసుకోవాలని హెల్త్ సెంటర్‌లోని రోగికి వివరించారు. ఈట్ రైట్ టూల్ కిట్‌ను రోగులకు చూపించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

వేద కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్

ఘట్‌కేసర్: కొర్రెముల్ గ్రామానికి చెందిన యాదగిరిగౌడ్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్ మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించాడు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం సొంత డబ్బులు రూ.10 వేలు అందజేశాడు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజుముదిరాజ్, వార్డు సభ్యులు ఆంజనేయులు, భాస్కర్, స్వామి, మాజీ ఉప సర్పంచ్ నాగార్జున, సత్యనారాయణ ముదిరాజ్, రవి పాల్గొన్నారు.

అతివేగానికి ఇద్దరు బలి

- కారు, టీవీఎస్ ఎక్సెల్ ఢీ.. మంటలు చెలరేగి రెండు వాహనాలు దగ్ధం
- అక్కడికక్కడే ఒకరు.. చికిత్స పొందుతూ మరొకరు మత్యుఒడికి..
- యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండల పరిధిలో ప్రమాదం
- మృతులిద్దరూ రాజాపేట మండల వాసులు



తుర్కపల్లి: అతివేగం ఇద్దరి ప్రాణాలను బలితీసుకుంది. వేగంగా వస్తున్న కారు ఎదురుగా టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే ఒకరు, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మత్యుఒడికి చేరుకున్నారు. ప్రమాద సమయంలో టీవీఎస్ఎక్సెల్ పెట్రోల్ ట్యాంక్ పగిలి కారు కిందికి దూసుకుపోవడంతో మంటలు చెలరేగి రెండు వాహనాలు దగ్ధమయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల పరిధిలో మంగళవారం చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్‌కు చెందిన స్నేహితులు బంగారు భాను, కాంపెల్లి రవికుమార్, సుంకిశాల అజయ్‌కుమార్, ఐతం ఆంజనేయులు యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకునేందుకు కారులో బయలుదేరారు. ఇదే క్రమంలో రాజాపేట మండలం నెమిల గ్రామపంచాయతీ స్వీపర్‌గా పనిచేస్తున్న భువనగిరి మైసయ్య(58), స్నేహితుడు ఎర్ర శంకరయ్య(54)తో కలిసి పని నిమిత్తం టీవీఎస్ ఎక్సెల్‌పై వెంకటాపూర్‌కు వెళ్తున్నారు. అయితే, వీరిద్దరి వాహనాలు తుర్కపల్లి మండలం వెంకటాపూర్ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో టీవీఎస్ ఎక్సెల్‌పై ప్రయాణిస్తున్న మైసయ్య, శంకరయ్య ఎగిరి రోడ్డుపై పడిపోయారు. మైసయ్య డివైడర్‌పై పడడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మతిచెందగా, తీవ్రంగా గాయపడిన శంకరయ్యను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

పెట్రోల్ ట్యాంక్ పగిలి..

రెండు వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొనడంతో టీవీఎస్ ఎక్సెల్ పెట్రోల్ ట్యాంక్ పగిలి కారు కిందికి దూసుకుపోయింది. ఈ క్రమంలో మంటలు అంటుకుని రెండు వాహనాలు దగ్ధమయ్యాయి. అయితే, కారులో ప్రయాణిస్తున్న స్నేహితులు ప్రమాదాన్ని పసిగట్టి కిందికి దిగిపోవడంతో ప్రాణాలను దక్కించుకున్నారు. కాగా, తుర్కపల్లి నుంచి యాదాద్రి వరకు ఓ వైపు రోడ్డు పనులు పూర్తయి రెండో వైపు సాగుతున్నాయి. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తుర్కపల్లి ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

గౌడవెల్లిలో డ్రైనేజీ పనులు ప్రారంభం



మేడ్చల్: గౌడవెల్లి గ్రామంలో మండల పరిషత్ నిధులతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను మాజీ ఎంపీపీ పద్మ జగన్‌రెడ్డి ప్రారంభించారు. మండల పరిషత్ నిధుల నుంచి రూ.2 లక్షలు వెచ్చించి నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులను ఆమె పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. గౌడవెల్లి గ్రామ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్, ఉపసర్పంచ్ పెంటమ్మ, మాజీ ఎంపీటీసీ లావణ్య, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పారిశ్రామిక ప్రగతి ఉత్సవం



ఘట్‌కేసర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీ యాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పారిశ్రామిక ప్రగతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని డయానో, కొండాపూర్‌లోని కూలర్ కంపెనీని పరిశీలించారు. ఆయా కంపెనీల పనితీరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్(టీఎస్–ఐపాస్) ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సరళీకృత పారిశ్రామిక విధానం, పరిశ్రమలు స్థాపించడానికి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై వివరించారు. అనంతరం ఆయా కంపెనీ యజమానులను సన్మానించారు. కార్యక్రమంలో కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్లు రమాదేవి, ఆంజనేయులుగౌడ్, అనురాధ, నర్సింగ్‌రావు, మాజీ వార్డు సభ్యుడు దేవేందర్‌ముదిరాజ్, జంగయ్యయాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, సిరాజ్, ఆంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రగతిలో మేడ్చల్‌కు ప్రథమ స్థానం

ప్రగతి కార్యక్రమంలో మంత్రి సీహెచ్ మల్లారెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: పారిశ్రామిక ప్రగతిలో దేశంలోనే తెలంగాణ దూసుకెళ్తోందని, దీనికి సీఎం కేసీఆర్ కృషి, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పట్టుదల కారణమని మంత్రి సీహెచ్ మల్లారెడ్డి అన్నారు. పారిశ్రామిక రంగంలో మేడ్చల్ తెలంగాణలో మొదటిస్థానంలో ఉండటం అదృష్టంగా, గర్వంగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం శామీర్‌పేట మండలం తుర్కపల్లిలోని విష్ణుల్యాబ్స్ లిమిటెడ్, జీనోమ్ వాలీలో నిర్వహించిన పారిశ్రామిక ప్రగతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్‌తో కలిసి ఆయన మొక్కలను నాటారు. ఆ తర్వాత ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఎక్కువ సంఖ్యలో పరిశ్రమలు ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న వినూత్న, పారిశ్రామిక విధానాలతో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఎన్నింటికో తెలంగాణ కేరాఫ్‌గా మారిందన్నారు. తెలంగాణకు ఎన్నో కొత్త పరిశ్రమలు వస్తున్నాయని, గతంలో మాదిరిగా ఎలాంటి పవర్ హాలీడేలు లేకుండా 24 గంటల విద్యుత్తు అందించడం వల్లే సాధ్యమవుతోందన్నారు. కరోనా సమయంలో జీనోమ్ వ్యాలీలో వ్యాక్సిన్ కనిపెట్టడం ప్రపంచానికే గర్వకారణమని తెలిపారు. ఈ కరోనా వ్యాక్సిన్‌ను ప్రపంచ దేశాలకు 35 శాతం అందించిందన్నారు. ఇలాంటి పెద్ద పరిశ్రమ మేడ్చల్ నియోజకవర్గంలో ఉండటం అదృష్టమన్నారు.

టీఎస్ ఐపాస్ వల్ల ఎంతో అభివృద్ధి

– కలెక్టర్ అమయ్‌కుమార్

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీఎస్ ఐపాస్, టీఎస్ బీపాస్‌తో ఎంతో అభివృద్ధి జరుగుతోందని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. టీఎస్–ఐపాస్‌తో కొత్త పరిశ్రమల స్థాపన, వాటికి అనుమతులు సులభతరం అయ్యాయన్నారు. ఉద్యోగ కల్పనలో హైదరాబాద్ దేశంలోని ఇతర రాష్ట్రాలను అధిగమించి ప్రథమ స్థానంలో నిలిచిన తీరును ఆయన వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లుబాయ్, జెడ్పీటీసీలు అనిత, శైలజ, కో ఆప్షన్ సభ్యులు, స్థానిక నాయకులు, పరిశ్రమల అధిపతులు, జోనల్ మేనేజర్ మాధవి ఏడీ వెంకటేశ్వర్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, జీనోమ్ వాలీ పరిశ్రమ అధిపతులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఈ నెల 12 నుంచి ఇంటర్, 14 నుంచి పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని కోరారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు 86 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 34,705మ ంది, సెకండ్ ఇయర్‌కు సంబంధించి 13,440 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. ఈ నెల 12 నుంచి 20 వరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షలు జరుగుతాయన్నారు. ఇంటర్ జూనియర్ విద్యార్థులకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ సీనియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు ఉంటాయన్నారు.

పదో తరగతి పరీక్షలు

ఈ నెల 14 నుంచి 22 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నట్లు అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి తెలిపారు. పదో తరగతికి సంబంధించి 4,443, మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా, 21 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటలరకు జరుగుతాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. స్ట్రాంగ్ రూం నుంచి పరీక్షా కేంద్రానికి, మళ్లీ పరీక్షా కేంద్రం నుంచి స్ట్రాంగ్ రూమ్ వరకు ఎగ్జామ్ మెటీరియల్‌ను తరలించడంలో సంబంధిత అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్తు సరఫరా, లైటింగ్, ఫ్యాన్లు, తాగునీటి వసతి అన్నీ ఉండేలా చూడాలన్నారు.

గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలకు ఏర్పాట్లు

- అభ్యర్థులు 49,660 మంది 101 పరీక్షా కేంద్రాలు
- మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1 పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1 పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ నెల 11న జరిగే గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలను మేడ్చల్ జిల్లాలో 49,660 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తుండగా, వీరి కోసం 101 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు వంటి ప్రాథమిక సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ లింగ్యానాయక్, కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రగతిలో దేశానికే దిక్సూచి తెలంగాణ

– మైక్రో ఇండస్ట్రీస్ ఏర్పాటుతో వేల ఉద్యోగాలు



మేడ్చల్‌రూరల్: ఐటీ ఎగుమతుల్లో, పారిశ్రామిక ప్రగతితో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచిగా నిలిచిందని మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది వేడుకల్లో పారిశ్రామిక ప్రగతి ఉత్సవాల్లో భాగంగా రావల్‌కోల్ గ్రామ పరిధిలో ఇటీవల మంజూరైన మైక్రో ఇండస్ట్రీస్ క్లస్టర్‌లో విద్యుత్ స్తంభాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రావల్‌కోల్‌లో మైక్రో ఇండ్రస్ట్రీస్ క్లస్టర్ ఏర్పాటుతో వేల సంఖ్యలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కలుగుతుందన్నారు. క్లస్టర్ ఏర్పాటుకు తాను ఐటీ మంత్రి కేటీఆర్‌ను కలవగా వెంటనే మంజూరు చేశారని తెలిపారు. 44 ఎకరాల్లో 200కు పైగా మైక్రో ఇండస్ట్రీస్, పరిశ్రమలు రానున్నట్లు తెలిపారు. పరిశ్రమల రాకతో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుందన్నారు. క్లస్టర్ ఏర్పాటు సహకారం అందించిన మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో అన్ని వర్గాల అభ్యున్నతి సాధించిందన్నారు. ఐటీ ఎగుమతుల్లో దేశానికే తెలంగాణ దిక్సూచిగా నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహేందర్, ఉపసర్పంచ్ రాజారాం, మైక్రో ఇండస్ట్రీస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీ

యువకుడి మృతి, మరో యువకుడికి తీవ్రగాయాలు



జహంగీర్ అలి యాస్ రాజు(ఫైల్)

ఘట్‌కేసర్: ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్రగాయాలైన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలం కొండమడుగుకు చెందిన జహంగీర్ అలియాస్ రాజు(25) ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. హోటల్ యజమాని హోండా యాక్టీవాపై అవుషాపూర్ పీపీఆర్ ఫంక్షన్ హాల్లో విందుకు హాజరై ఇంటికి తిరిగి వస్తున్నాడు. కేపాల్ స్టార్ బాంక్వేట్ హాలు వద్దకు చేరుకోగానే అదే గ్రామానికి చెందిన బిల్ల నవీన్ ద్విచక్రవాహనంపై వ్యతిరేఖ దిశలో వేగంగా, అశ్రద్ధగా ప్రయాణిస్తూ జహంగీర్ వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో జహంగీర్ తల, శరీర భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మరణించగా తీవ్ర గాయాలైన నవీన్ చికిత్స పొందుతున్నాడు. మృతుడి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.